# నాటక కళాప్రపూర్ణ టీజీ కమలాదేవికి కన్నీటి వీడ్కోలు!

టీవీయస్. శాస్త్రి



అలనాటి తెలుగు సినీనటి, గాయని టి.జి. కమలాదేవి (84) గురువారం నాడు (16 -08 - 2012) చెన్నైలో షెనాయ్‌నగర్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆమె కుమారుడు జయచంద్ర మద్రాస్ హైకోర్టులో న్యాయవాది. భర్త ఆవుల చంద్రబాబునాయుడు. టి.జి. కమలాదేవి ఆవుల చంద్రబాబునాయుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరిది వర్ణాంతర వివాహం. ఆదివారం మధ్యాహ్నం ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కమలాదేవి మృతికి తెలుగు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. 1929 డిసెంబరు 29వ తేదీన జన్మించిన కమలాదేవి స్వస్థలం చిత్తూరుజిల్లా కార్వేటినగరం. ఈమెకి పెద్దలు పెట్టిన పేరు గోవిందమ్మ. దివంగత నటుడు చిత్తూరు నాగయ్యకు ఆమె స్వయానా మరదలు. రంగస్థలం, చిత్రసీమ, ఆకాశవాణి, క్రీడారంగం వంటి నాలుగు మాధ్యమాల్లో నిలదొక్కుకున్న వ్యక్తి కమలాదేవి. నాటకరంగం ఆమె ప్రధాన వ్యాపకం, అభిమాన రంగం. మద్రాసులో ఉన్న చెన్నపురి ఆంధ్రమహాసభ కార్యక్రమాల వెనుక ఆమె కార్యదీక్ష, దక్షత, ముందుచూపు ఉన్నాయి. 1950లో ఆ సంస్థలో సభ్యత్వం పొంది 1956 నుంచి కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా వివిధ హోదాల్లో సేవ చేసింది. 1939వ సంవత్సరంలో పుత్తూరులో 'వందేమాతరం' చిత్ర కథానాయకుడు చిత్తూరు వి. నాగయ్యకు ఘన

సన్మానం ఏర్పాటైంది. ఆ సన్మానంలో కమలాదేవి తనకు ఇష్టమైన పాటను ప్రార్థనా గీతంగా పాడినప్పుడు నాగయ్య విని, ఆమె ప్రతిభను గమనించి చెన్నై వెళ్ళాక బి.ఎన్.రెడ్డితో కమలాదేవి గురించి చెప్పి సినిమాలకు సిఫార్సు చేశాడు. నాగయ్య మాటతో బి.ఎన్. రెడ్డి ఈమెని మద్రాసుకి పిలిపించి పాత్ర ఇద్దామనుకున్నాడు. అయితే ఆ పాత్ర కమలాదేవి చేజారిపోయింది. ఆమె రంగస్థలంమీద ఎన్నో పురుష పాత్రలను ధరించి మెప్పించింది. వాటిల్లో 'అలెగ్జాండర్' సుప్రసిద్ధం. ఈ ఒక్క పాత్రనే ఆమె పాతికసార్లు ప్రదర్శించి మెప్పించారు. రంగస్థలంపై నటనకు ఒకసారి బంగారు పతకాన్ని, 80 సార్లు రజత పతకాలనూ గెలుచుకున్న నటీశిరోమణి టీజీకే. నాటకరంగానికి కమలాదేవి సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ నాటక ఎకాడెమీ వారు ఆమెకు 'నాటక కళా ప్రపూర్ణ' బిరుదునిచ్చారు. కమలాదేవి సెన్సార్ బోర్డు చైర్మన్‌గా కూడా సేవలందించారు. బి.ఎన్. రెడ్డి 1951లో తీసిన మహత్తర తెలుగు చిత్రం 'మల్లీశ్వరి' సినిమాలో ఆమెను చాలామంది చూసే ఉంటారు. ఆ సినిమాలో మల్లీశ్వరి (భానుమతి) రాణివాసానికి వెళ్లిన తర్వాత అక్కడ ఆమెకో ఇష్టసఖి జలజ అనే ఆమె తటస్థపడుతుంది.ఆ జలజ ఎవరో కాదు, టీజీ కమలాదేవే! నిజానికి మల్లీశ్వరికన్నా పదేళ్లకు ముందే టీజీకే సినీరంగ ప్రవేశం జరిగిపోయింది. 1941లోనే హెచ్.ఎమ్. రెడ్డి తీసిన 'తెనాలి రామకృష్ణ' సినిమాతో టీజీకే శ్రీకారం చుట్టింది. అదే సంవత్సరం ఆమె 'చూడామణి', 'దక్షయజ్ఞం' చిత్రాల్లో కూడా నటించారు. అటు తర్వాత వరసపెట్టి పాతాళభైరవి, బాలనాగమ్మ, మల్లీశ్వరి, ముగ్గురు మరాఠీలు, గుణసుందరి కథ, మాయలోకం లాంటి 70 వరకు సినిమాలలో నటించారు. అలా అనేక చిత్రాల్లో నటించి తన గానంతో, నటనతో ఆంధ్ర, తమిళ ప్రేక్షకులను మైమరిపించింది. సినిమాల్లోకి రాకముందే టీజీకే నటిగానూ, గాయనిగానూ మంచి పేరు తెచ్చుకుంది. సినిమాల్లో నటించడంకన్నా తనకు రంగస్థలంపై అభినయించడమంటేనే అభిమానమని టీజీకే అనేవారు. ఇక డబ్బింగ్ కళలో కూడా టీజీకే ఆరితేరారు. పద్మిని, లలిత, బి.సరోజాదేవి తదితర హీరోయిన్లకు టీజీకే గొంతు ఎరువిచ్చారు. ఎన్ఏటీ వారి సీతారామకళ్యాణం చిత్రంలో సీతగా నటించిన గీతాంజలికి టీజీకే చెప్పిన డబ్బింగ్ సుప్రసిద్ధం. అలాగే, పాండురంగ

మహాత్మ్యం చిత్రంలో బి. సరోజాదేవికి ఆమె డబ్బింగ్ చెప్పారు. తర్వాతి రోజుల్లో 'కంచుకోట', 'అసాధ్యుడు', 'బంగారు సంకెళ్లు', 'కథానాయకుడు', 'బంగారు పంజరం', 'పెత్తందార్లు' తదితర చిత్రాల్లో టీజీకే చిన్నచిన్న వేషాలు వేశారు. వీటన్నిటినీ మించి, ఆమె గొప్ప బిలియర్డ్స్ క్రీడాకారిణి. జంషెడ్‌పూర్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన పోటీల్లో రెండుసార్లు జాతీయస్థాయి చాంపియన్ షిప్ ను గెలుచుకున్నారు ఆమె. బిలియర్డ్స్‌లో రాణించిన తొలితరం మహిళల్లో ముందుగా చెప్పుకోవలసిన పేరు ఆమెదే! ఒక్క వ్యక్తిలో ఇంత ప్రతిభ, బహు ముఖాలుగా ప్రకాశించటం చాలా అరుదైన విషయం! తనకు రాదగినంత పేరు, ప్రోత్సాహం దక్కలేదని కమలాదేవి బాధపడేవారు. ఆమె బాధలో ఎంతో న్యాయం ఉంది! అంతటి బహుముఖ ప్రజ్ఞావంతురాలు ఒక తెలుగు మహిళ కావటం, తెలుగు వారిగా మనమంతా గర్వించతగ్గ విషయం!

**మరుగునపడి మరణించిన మరో మాణిక్యానికి నా కళాంజలి! శ్రద్ధాంజలి!!**